AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

9-10-2025 (Thursday) MAIN EDITION

## కెనరా బ్యాంక్ నుంచి మరో ఐపీవో..





**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కెనరా బ్యాంక్ నుంచి మరో పబ్లిక్ ఇష్యూ వస్తోంది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. కంపెనీ షేర్లు ఈనెల 17న లిస్టవనున్నాయి. ఈ కంపెనీ మార్కెట్‌నుంచి రూ. 2,517.50 కోట్లు సమీకరించడం కోసం ఐపీవోకు వస్తోంది. ఒక్కొక్కటి రూ.10 ముఖ విలువ కలిగిన 23,75,00,000 షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయిస్తున్నారు. ఇందులో కెనరా బ్యాంకు 13,77,50,000 షేర్లు, హెచ్‌ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ 47,50,000 షేర్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు 9,50,00,000 షేర్లు విక్రయిస్తున్నాయి.

## విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజకీయ నాయకుడిగా మారిన నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్‌కి బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. చెన్నైలోని ఆయన ఇంటి వద్ద బాంబులు పెట్టినట్లు గురువారం బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో పోలీసులు ఆయన ఇంటి చుట్టూ భద్రతను పెంచారు. క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఎటువంటి అనుమానాస్పద వస్తువులు దొరకలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించిన పోలీసులు.. అది ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై దర్యాప్తు ప్రారంభించారు.

## ‘ఏఐని దుర్వినియోగం చేయొద్దు’




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈసీ రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నేపథ్యంలో డీప్‌ఫేక్‌లను సృష్టించడానికి, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేందుకు కృత్రిమ మేధను దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది.

## బొలెరోను ఢీకొన్న డీసీఎం



**అక్షరటుడే, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలోని కంది మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. టమాటాల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనాన్ని డీసీఎం ఢీకొట్టింది. దీంతో బొలెరోలోని టమాటాలు రోడ్డుపై పడ్డాయి. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు ఎగబడి టమాటలను సంచుల్లో తీసుకెళ్లారు.

## యూపీలో కూలిపోయిన విమానం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే ఓ విమానం కూలిపోయింది. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. మొహమ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఎయిర్‌స్ట్రిప్ రన్‌వేపై నుంచి టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే రన్‌వే పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో పైలెట్లు, ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు.

## రూ.10 వేల కోట్లతో రోడ్ల అభివృద్ధి



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దశలవారీగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్లను నిర్మిస్తామని ఆయన వెల్లడించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంపై మంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో రూ.10,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. వచ్చే నెలలో వీటికి టెండర్లు పిలుస్తామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసల హ్యామ్ రోడ్లు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి నాలుగు వరుసల రోడ్లు నిర్మిస్తామని ఆయన వెల్లడించారు.

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 పరీక్షలపై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై జోక్యానికి న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టులోనే తేల్చుకోవాలని ప్రభుత్వం పిటిషనర్లకు సూచించింది. తాజాగా గ్రూప్-1పై సైతం హైకోర్టు విచారణలో పెండింగ్‌లో ఉండగా తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును వేముల అనుష్ అనే వ్యక్తి సుప్రీంలో సవాలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ సమయంలో జోక్యం చేసుకోలేమని చెప్పింది.

**స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. జీవో అమలును నిలిపివేస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. జీవోపై స్టే ఇవ్వడంతో నోటిఫికేషన్ రద్దయినట్లేనని పిటిషనర్ల తరపు లాయర్లు తెలిపారు. కాగా.. ప్రభుత్వం న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్తుందనే ఉత్కంఠ నెలకొంది.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# స్థానిక పోరుకు బ్రేక్..



- జీవ్ నంబర్ 9పై స్టే విధించిన హైకోర్టు
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- ఆరు వారాలకు విచారణ వాయిదా
- సర్కారు నిర్ణయంపై నెలకొన్న ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై స్టే ఇచ్చింది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై సైతం స్టే విధిస్తూ నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టి రిజర్వేషన్ అమలు చేసినట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై గురువారం ఆయన వాదనలు వినిపించారు. బీసీ కుల గణన చేపట్టాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. సర్వేలో బీసీ జనాభా 57.6 శాతం ఉందని తేలిందన్నారు. కులగణన మేరకు బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. ఆ బిల్లును రాష్ట్రపతి పెండింగ్‌లో పెట్టారన్నారని చెప్పారు. తమిళనాడు కేసులో సుప్రీం తీర్పు ప్రకారం రాష్ట్రపతి బిల్లు పెండింగ్‌లో పెట్టడంతో ఆమోదం పొందినట్లే అని కోర్టుకు ఏజీ వివరించారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలిపి ఉంటే ప్రభుత్వం నోటిపై చేసి ఉండేదన్నారు. అయితే రాష్ట్రపతి ఆమోదం తెలపకపోవడంతో ప్రభుత్వం నోటిపై చేయాల్సిన అవసరం లేదని వాదించారు.

### మొత్తం ఆరు పిటిషన్లపై..

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా మాధవరెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఆయనతో పాటు పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే రిజర్వేషన్లకు మద్దతుగా కూడా ఆర్ కృష్ణయ్య తదితరులు పిటిషన్లు వేశారు. మొత్తం ఆరు పిటిషన్లపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్లు, ప్రభుత్వం తరఫు వాదనలు విన్న ధర్మాసనం విచారణను గురువారం మధ్యాహ్నం 2:15 గంటలకు వాయిదా వేసింది. గురువారం ప్రభుత్వం తరపున ఏజీతో పాటు రవివర్మ వాదనలు వినిపించారు.

### సర్కారు స్పందనపై ఉత్కంఠ

హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది ఉత్కంఠగా మారింది. న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్తుందనే వేచి చూడాల్సిన అంశం. మరోవైపు బీసీ రిజర్వేషన్లు రావడంతో పోటీకి ఏర్పాట్లు చేసుకున్న ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

కాగా.. బీసీ రిజర్వేషన్ల అంశం ఒక వైపు కోర్టులో ఉండగానే ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 565 జెడ్పీటీసీలు, 5,749 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరిపేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల స్వీకరణ సైతం ప్రారంభించింది. అయితే ఇంతలోనే హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. కాగా.. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలాంటి ప్రకటన చేయలేదు.

## సీఎం రేవంత్ రెడ్డిది చేతకాని పాలన



**అక్షరటుడే, హైదరాబాద్:** వెనుకబడిన తరగతుల ప్రజలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆడుకుంటున్నాడని.. ఆయనది చేతకాని పాలన అని ఎంపీ అర్వింద్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిపై విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి వెనుకబడిన వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంలో ఆయనకు చిత్తశుద్ధి లేదన్నారు. రాజ్యాంగ సవరణ లేకుండా రిజర్వేషన్ల పెంపు ఎలా సాధ్యమవుతుందని అనుకున్నారని ప్రశ్నించారు. తెలిసి కూడా జీవో ఇచ్చారన్నారు. రేవంత్ పాలనపై రైతులు, యువత, మహిళలు, ఎన్నారైలు ఇలా అందరూ అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు.

## శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్, హమాస్ సంతకం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండు దేశాల మధ్య శాంతి కోసం కొంతకాలంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. యుద్ధం ముగింపు కోసం ట్రంప్ 20 సూత్రాల ప్రణాళికను తీసుకు వచ్చారు. దీనిలో భాగంగా ఇజ్రాయెల్ బందీలను హమాస్ తక్షణమే విడిచిపెట్టాలి. ఇందుకు హమాస్ అంగీకరించింది. తాజాగా యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ ముందుకు వచ్చినట్లు ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాలు మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గాజా యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇదో గొప్ప అడుగుగా ఆయన అభివర్ణించారు. ఒప్పందం కుదరడంలో కీలకంగా వ్యవహరించిన దేశాలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇండియా, యూకే సహజ భాగస్వామ్య దేశాలు: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇండియా, యూకే సహజ భాగస్వాములని ప్రధాని మోదీ అన్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో ముంబైలో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న అనంతరం సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య నెలకొన్న సంబంధాలు ప్రపంచ సంబంధాలకు శాశ్వత చిహ్నంగా నిలుస్తాయన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను ప్రస్తావిస్తూ, ముఖ్యమైన వాణిజ్య ఒప్పందాలు రెండు దేశాల సంబంధాలను మరో స్థాయికి తీసుకెళ్తాయన్నారు. యూకే ప్రధాని స్మార్టర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. భారత ప్రధాని అవిశ్రాంత కృషి భారతదేశ ఆర్థిక స్థితిని ఏకీకృతం చేసిందన్నారు. ఇండియాను ప్రపంచంలో ఒక బలీయమైన ఆర్థిక శక్తిగా మార్చిందన్నారు.



## బస్ భవన్ ముట్టడి

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** బస్ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ నాయకులు బస్ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఆర్టీసీ ఇటీవల హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా గురువారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు నిరసనకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున బస్‌భవన్‌కు చేరుకున్నారు. అనంతరం ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం అందజేశారు.

## ‘వారిని జిల్లా జడ్జీలుగా నియమించొచ్చు’

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జిల్లా జడ్జీల నియామకంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏడేళ్లపాటు అడ్వకేట్‌గా ప్రాక్టీసు చేసిన అనంతరం కింది కోర్టుల జడ్జీలుగా నియమితులైన వారు బార్ అసోసియేషన్ కోటా కింద జిల్లా జడ్జీలుగా నియామకానికి అర్హులేనని తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు చెప్పింది. న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేసి న్యాయాధికారులుగా నియమితులయ్యే సివిల్ జడ్జీలు కూడా బార్ కోటా కింద జిల్లా జడ్జీ నియామక పరీక్షకు హాజరయ్యేలా అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది.



## బాలీవుడ్‌కు తెలుగు బ్యూటీ..

**తన గ్లామర్, నటనతో టాలీవుడ్‌నే కాదు, బాలీవుడ్‌ను కూడా ఆకర్షిస్తోంది శ్రీలీల. టాప్ హీరోల సరసన వరుసగా అవకాశాలు దక్కించుకుంటూ ఆమె క్రేజ్ అమాంతం పెంచుకుంటోంది. తాజాగా ఆమె బాలీవుడ్‌లో కూడా గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమవుతోంది. బాలీవుడ్‌లో శ్రీలీల ‘తు మేరీ జిందగీ హై’ అనే చిత్రంలో స్టార్ హీరో కార్తిక్ ఆర్యన్ సరసన నటిస్తోంది. సినిమాలతో పాటు కార్పొరేట్ బ్రాండ్ల ప్రచారాల్లోనూ శ్రీలీలకు మంచి డిమాండ్ ఉంది. తాజాగా ప్రముఖ జర్మన్ ఏవియేషన్ గ్రూప్ – లుఫ్తాన్సా ప్రచార కార్యక్రమంలో శ్రీలీల పాల్గొంది. లండన్ కేంద్రంగా ఈ బ్రాండ్ కోసం ఆమె చేసిన ఫొటోషూట్ యూత్‌లో భారీగా వైరల్ అవుతోంది. ఆమె కెరీర్ జోరు చూస్తే రానున్న రోజులలో ఆమె స్టార్ డమ్ ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తోంది.** – అక్షరటుడే, సినిమా డెస్క్